సాక్షి తిరుపతి

శుక్రవారం । 26 । జూలై । 2024



గోవుల షెడ్లలో పాగా!

గోకులం పథకాన్ని పచ్చ బ్యాచ్‌కి కట్టబెట్టేందుకు సర్వం సిద్ధమైంది. ఈ మేరకు గ్రామ తీర్మానాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. - 8లో



మంచి వైద్యుడు కావాలి

ప్రతి ఒక్కరూ గుడ్ డాక్టర్ కావాలని ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్ పిలుపునిచ్చారు. - 8లో



కఠిన చర్యలు

ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధానికి కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

విశ్వగురువుగా భారత్ నిలవాలి



మాట్లాడుతున్న వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ: భారతీయ జ్ఞానాన్ని ప్రపంచ వ్యాప్తి చేసి భారతదేశాన్ని విశ్వగురువుగా నిలిపేందుకు కలసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎన్ఎస్‌యూ ఏడీ బిల్డింగ్‌లో బెంగళూరుకు చెందిన సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్ కంప్యూటింగ్ (సీ–డాక్), తిరుపతి ఎన్ఎస్‌యూ మధ్య 'విద్యా, జ్ఞానసముపార్జన, వర్క్‌షాపుల నిర్వహణపై సహాయ సహకారాలు' అనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్ఈపీ–2020 వర్సిటీలో అమలవుతోందని, ఇందులో భాగంగా సీ–డాక్‌తో వర్సిటీ చేపట్టనున్న కార్యక్రమాలు, సహాయసహకారాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. వివిధ విభాగాలపై చర్చించడానికి ఆగస్టు 11 నుంచి మూడురోజుల పాటు వర్క్‌షాపును నిర్వహించి సీ–డాక్‌తో వర్సిటీ పలు అంశాలపైన ఎమ్ఓయూ కుదుర్చుకుంటుందన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ రమాశ్రీ, ప్రొఫెసర్లు గణపతిభట్, హైదరాబాద్ నిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్వీఎస్ఎస్ అవధానులు, శివరాం, రమేష్‌బాబు, సీ–డాక్ ఇన్‌చార్జి వైవీ. కృష్ణారావు, ఐఐటీ ప్రొఫెసర్ కృష్ణ ప్రపూర్ణ, సైంటిస్టులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

28న జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపిక


తిరుపతి రూరల్: తిరుపతి జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న జిల్లా జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల సెలెక్షన్స్ నిర్వహించనున్నట్లు ఆ సంఘ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి డీ.సుధీర్ గురువారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించే ఈ సెలెక్షన్స్‌లో ఎంపికైన జట్టు ఆగస్ట్ 4, 5 తేదీల్లో విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్, రాష్ట్ర జట్ల ఎంపికల్లో పాల్గొంటాయన్నారు. పోటీలో పాల్గొనే క్రీడాకారులు 2006 లో జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 28వ తేదీ ఉదయం 8 గంటలకు జన్మదిన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్ జిరాక్స్ కాపీతో పాటు నాలుగు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరుకావాలని పేర్కొన్నారు. వివరాల కోసం 9032270031 మొబైల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

'నా చేతుల్లోనే పెరిగాడు. నా ఎంగిలిపాలే తాగాడు. నా సంకలోనే తిరిగాడు. నేనే పెంచి పెద్దచేసి పెండ్లి కూడా చేశాను. నా కుటుంబానికి తమ్ముడే యముడవుతాడని ఊహించలేకపోయాను. ముక్కుపచ్చలారని ఇద్దరు ఆడబిడ్డలు బాబాయ్..! అంటూ ఆప్యాయంగా పిలుస్తున్నా వాడి మనసు కరగలేదు. కొడుకుకన్నా ఎక్కువగా చూసుకుంటున్న తల్లిలాంటి వదినమ్మనూ నమ్మలేదు. తన భార్యతో విడాకులు ఇప్పించలేదని పగ పెంచుకున్నాడు. నా భార్య, ఇద్దరు పిల్లలను గొంతుకోసి కక్ష తీర్చుకున్నాడు. ఆపై తనూ ఉరి వేసుకుని తనువు చాలించాడు. ఇంత కన్నా ఘోరం ఇంకొకటుందా..?. నా కుటుంబానికే ఇన్ని కష్టాలు పెట్టావా దేవుడా..! కొన్న కారు, కట్టుకుంటున్న ఇల్లు భార్యాపిల్లలకు చూపించకనే చంపేశాడు..' అంటూ అన్న దాసు గుండెలు బాదుకుంటూ బోరున ఏడ్చుతుంటే గ్రామస్తులు చెమర్చిన కన్నీళ్లతో ఓదార్చడం స్థానికులను కలచివేసింది. ఎంతో గౌరవంగా ఉన్న ఒకే కుటుంబంలో నలుగురి మృతదేహాల్ని చూసి గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించడం ఆ పల్లెను ఎక్కిళ్లు పెట్టేలా చేసింది. ఈ ఘటన ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

పొదరిల్లు.. చెమర్చిన కళ్లు



భార్య, పిల్లలు, తమ్ముడి మృతదేహాల వద్ద గుండెలవిసేలా రోదిస్తున్న దాసు



మాటలకందని విషాదం

ఒకే కుటుంబంలో నలుగురు మృతిచెందగా.. ఆ నలుగురికీ ఒక్కరే తలకొరివి పెట్టడం పుట్టెడు దుఃఖాన్ని మిగిల్చింది. దాసు తన భార్య, పిల్లల తోపాటు తన తమ్ముడు మోహన్‌కు సైతం దహన సంస్కారాలు నిర్వహించారు. ఒకే కుటుంబంలో ఇలా ఒక్కరే నలుగురికి తలకొరివి పెట్టిన ఘటన ఎప్పుడూ చూడలేదని స్థానికులు తెలిపారు.

- ముచ్చటైన కుటుంబాన్ని చిదిమేసిన తమ్ముడు
- విడాకులు ఇప్పించలేదని కక్ష
- అన్న భార్యను, పిల్లల్ని గొంతుకోసి హత్య
- బంగారు భవితకు బాటలు వేసుకుంటున్న తరుణంలో ఘటన
- కొన్న కారు, ఫ్లాటును భార్యాపిల్లలకు చూపించేలోపే ఘోరం
- పొదరింటిని తలచుకుని బోరున ఏడ్చుతున్న గ్రామస్తులు
- ఏంచేయాలో దిక్కుతోచని స్థితిలో అన్న



దాసు కుటుంబ సభ్యులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, తిరుపతి: వెంకటగిరి నియోజకవర్గం, సైదాపురం మండలం, గంగాదేవిపల్లె నుంచి రెండేళ్ల క్రితం తిరుపతికి వచ్చి స్థిరనివాసం ఏర్పాటు చేసుకుని సంతోషంగా జీవనం సాగిద్దామని భావించిన దాసు కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. తిరుపతి పద్మావతీనగర్‌లో నివాసముంటున్న తిరిపి దాస్ సొంత తమ్ముడు అన్న భార్యను, ఇద్దరు కుమార్తెలను కత్తితో గొంతు కోసి తనూ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన తెలిసిందే. సంచలనంగా మారిన ఈ ఘటన గంగాదేవిపల్లెలో విషాదం అలముకుంది.. వివాదాలకు దూరంగా ఉండే ఆ కుటుంబంలోని నలుగురి మృతదేహాలు ఒకేసారి గురువారం గ్రామానికి చేరుకోవడంతో స్థానికులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు.

విడాకులు ఇప్పించలేదని కక్ష

గంగాదేవిపల్లెకి చెందిన గుడిమెట్ల పెంచలయ్య, రమణమ్మకు ముగ్గురు కుమారులు. ఇందులో తిరిపి దాసు, మోహన్, శ్రీనివాసులు ఉన్నారు. దాసుకి సుమారు 15 ఏళ్ల క్రితం వివాహమయ్యింది. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దాసు తిరుపతిలో ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. వృత్తిరీత్యా రెండేళ్ల క్రితం కుటుంబంతో తిరుపతికి చేరుకున్నాడు. దాసు పెద్దపాప దేవిశ్రీ ఎనిమిదో తరగతి, చిన్నపాప నీరజ ఆరో తరగతి చదువుతున్నారు. తమ్ముడు మోహన్‌కి 2019లో వివాహం జరిపించాడు. మోహన్ చెన్నైలో ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. శ్రీనివాసులుకి మానసిక పరిస్థితి బాగోలేదు. గ్రామంలోనే ఉంటున్నాడు. దాసే శ్రీనివాసులు బాగోగులు చూసుకుంటుంటాడు. మోహన్‌కు వివాహం అయిన కొంత కాలం నుంచి ఇద్దరి మధ్య తరచూ గొడవలు తలెత్తడం, దాసు వెళ్లి పరిష్కరించడం జరిగేవి. రెండేళ్ల క్రితం మోహన్ భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. కొద్ది రోజుల తరువాత మోహన్ భార్య తల్లిదండ్రుల వద్దకు దాసు వెళ్లి మధ్యస్తం చేశాడు. ఆ సమయంలో మోహన్ అన్న దాసుపై చేయికూడా చేసుకున్నట్లు కుటుంబీకులు చెబుతున్నారు. ఆ తరువాత కొన్నాళ్లు కలిసి ఉన్నా తిరిగి ఇద్దరి మధ్య గొడవలు రావడంతో మోహన్ భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ విషయంపై మోహన్ తరచూ అన్న దాసుతో గొడవపడ్డా సర్దిచెప్పేవాడు. చివరకు మోహన్ భార్యతో విడాకులు ఇప్పించమని ఒత్తిడి చేసేవాడని తెలిసింది. సాధారణంగా కుటుంబంలో గొడవలు జరగడం, సర్దుకుపోవడం సర్వసాధారణం. అలాగే జరుగుతుందని దాసు భావించాడు



మృతులు సునీత



దేవిశ్రీ



నీరజ



మోహన్

వేడుకున్నా.. వదల్లేదు



మోహన్(ఫైల్)

రెండు రోజుల క్రితం చెన్నై నుంచి తిరుపతికి వచ్చిన మోహన్ తన అన్నతో కలిసి ఉంటున్నాడు. బుధవారం సాయంత్రం ప్రైవేటు స్కూల్లో చదువుతున్న అన్న కుమార్తెలను ఇంటికి తీసుకొచ్చాడు. అన్న దాసు నగరంలోకి వెళ్లడం చూసి మోహన్ వదిన సునీత, అన్న కుమార్తెలు దేవిశ్రీ, నీరజని హతమార్చేందుకు నిర్ణయించుకున్నాడు. విడాకులు ఇప్పించలేదనే కోపంతో కత్తితో దాడిచేయడంతో పిల్లలు బాబాయ్.. బాబాయ్ అని అరిచినట్లు చుట్టుపక్కల వాళ్లు చెబుతున్నారు. వదిన, పిల్లలు అని చూడకుండా కత్తితో గొంతు కోసి తను గదిలోకి వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో ఆ కుటుంబంలో అంతులేని విషాదం అలముకుంది.

కొత్త ఇంట్లోకి వెళ్లకుండానే..

రెండేళ్ల క్రితం కుటుంబంతో తిరుపతికి చేరుకున్న దాసు కొంత నగదును కూడబెట్టి ఫ్లాటు కొనుగోలు చేశాడు. రెండు రోజుల క్రితం కారు కూడా కొనుగోలు చేశాడు. అదే కారులో బుధవారం పిల్లలను ఎక్కించుకుని తిప్పాడు. త్వరలో గృహప్రవేశం చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు కుటుంబీకులు చెబుతున్నారు. అదేవిధంగా గ్రామంలో శ్రీనివాసులు ఉండేందుకు ప్రభుత్వ పథకం కింద పక్కాగృహం కూడా నిర్మించినట్లు చెబుతున్నారు. అద్దె బాధల నుంచి బయటపడి, సంతోషంగా కుటుంబంతో గడిపేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్న తరుణంలో తమ్ముడి రూపంలో మృత్యువు భార్య, పిల్లలను కబళించింది. సొంత తమ్ముడే ఇలా చేస్తాడని ఊహించని దాసు ఘటనను చూసి కన్నీరు మున్నీరవుతున్నాడు. చెప్పుకోవడానికి కుటుంబంలో మానసిక స్థితి సరిగాలేని తమ్ముడుని తలుచుకుని భార్య, పిల్లలు, తమ్ముడు మృతదేహాలను చూసి విలపించడం స్థానికులను కలచివేసింది. ఈ ఘటన విషయంపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. మృతదేహాలకు గురువారం రుయాలో పంచనామా నిర్వహించి.. అనంతరం స్వగ్రామం సైదాపురం మండలం గంగాదేవిపల్లెకు తరలించారు.

కండలేరు నుంచి నీటి విడుదల



తిరుపతికి వచ్చే పంపింగ్ విధానాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా: తిరుపతి నగర ప్రజల తాగునీటి కోసం కండలేరు నుంచి కేపీ కెనాల్ ద్వారా గురువారం సాయంత్రం నీటిని విడుదల చేశారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య నీటి పంపింగ్‌ను ప్రారంభించారు. అనంతరం శ్రీకాళహస్తి సమీపంలోని కండలేరు జలాశయాన్ని ఆమె తనిఖీ చేశారు. వీధి ప్రాంతాల్లో అత్యవసరంగా చేయాల్సిన పనులను పూర్తి చేయాలని ఆమె ఇంజినీర్లను ఆదేశించారు. కండలేరు నుంచి నీటి సరఫరా గత కొంతకాలంగా జరగడం లేదని, ఇరిగేషన్ అధికారులకు మునిసిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ అనుమతితో రూ.85 లక్షలు ఇటీవలే కేటాయించారన్నారు. గ్రావిటీ ద్వారా నీటి సరఫరా చేసే ప్రాంతంలో పూడికతీత పనులు పూర్తయ్యాయని ఆమె పేర్కొన్నారు. తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని నగర ప్రజలు నీటి వృథాను అరికట్టాలని సూచించారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ తిరుమాలిక మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ మహేష్ పాల్గొన్నారు.

పచ్చ బ్యాచ్‌కి గ్రావెల్ మేత!

- కోర్టు ఉత్తర్వులు హుష్ కాకి
- రెచ్చిపోతున్న తెలుగు తమ్ముళ్లు
- పట్టించుకోని అధికారులు



శిరసనంబేడు గ్రామం మదినేనిగుంటలో గ్రావెల్ తవ్వకాలు

పెళ్లకూరు: అధికార అండదండలతో తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోతున్నారు. కోర్టు ఆదేశాలను సైతం బేఖాతర్ చేస్తున్నారు. అడ్డదిడ్డంగా చెరువుల్లో యంత్రాల సాయంతో గ్రావెల్ తవ్వుతూ జేబులు నింపుకుంటున్నారు. అధికారులకు తెలిసినా అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. వివరాలు.. మండలంలోని శిరసనంబేడు కేంద్రంగా గ్రావెల్ మాఫియా పేట్రేగుతోంది. మైనింగ్, రెవెన్యూ అధికారులను తమదైన శైలిలో సర్దుబాటు చేసుకొని రేయింబవళ్లు గ్రావెల్ అక్రమతవ్వకాలు చేస్తున్నారు. మండలంలో సీనియర్ టీడీపీ నేతలుగా చెలామణి అవుతున్న కొందరు నందిమాల, యర్రగుంట, శిరసనంబేడు, రోసనూరు, రాజుపాళెం తదితర గ్రామాల్లో యంత్రాలతో గ్రావెల్ తవ్వకాలు చేపట్టి ప్రయివేట్ కంపెనీలకు విక్రయిస్తున్నారు. అలాగే శిరసనంబేడు గ్రామంలో ఉన్న మదినేనిగుంటలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేపట్టి నాయుడుపేట పరిసరాల్లో లేఅవుట్లు, మేనకూరు సెజ్‌లో పరిశ్రమలకు, 71వ జాతీయ రహదారి రోడ్డు అభివృద్ధి పనులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మైనింగ్, రెవెన్యూ అధికారులకు మామూళ్లు అందజేసి నిత్యం యంత్రాలతో గ్రావెల్ తవ్వకాలు చేపట్టి లారీలతో తరలిస్తున్నారు. దీనివల్ల ఆ రహదారి గుంతలమయమై ప్రమాదకరంగా మారింది. రేయింబవళ్లు గ్రావెల్‌ను తరలించడం వల్ల గ్రామీణ ప్రాంతాల రోడ్లన్నీ ధ్వంసమయ్యాయి.

డోన్ట్ కేర్

శిరసనంబేడు, రోసనూరు, అర్ధమాల, నందిమాల, యర్రగుంట గ్రామ పరిసరాల్లో గ్రావెల్ తవ్వకాలు చేపట్టరాదని గతంలోనే కోర్టు ఆదేశాలిచ్చింది. కానీ ఇక్కడ టీడీపీ నేతలు ఆ ఆదేశాలను పట్టించుకోవడంలేదు. 5 వేలు క్యూబిక్ మీటర్లకు మాత్రమే మైనింగ్ అనుమతులు ఉన్నప్పటికీ 50 వేల క్యూబిక్ మీటర్లకు పైగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. చెరువుల్లో పది అడుగుల లోతుకు గ్రావెల్ తవ్వేయడం వల్ల వర్షాలప్పుడు మూగజీవాలకు ప్రమాదం పొంచి ఉంది. జిల్లా మైనింగ్ ఉన్నతాధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు చేపడుతాం

శిరసనంబేడు, యర్రగుంట, నందిమాల చెరువులు, రోసనూరు అటవీ భూములు, పలు ప్రాంతాల్లోని అసైన్డ్ భూముల్లో గ్రావెల్ తవ్వకాలపై ఫిర్యాదులు వస్తున్నాయి. జిల్లా మైనింగ్ అధికారులతో మాట్లాడుతున్నా. అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకుంటాం.

– ప్రసాద్‌రావు, తహసీల్దార్ పెళ్లకూరు

మధ్యవర్తిత్వంతో అందరికీ ఉపయోగం



మాట్లాడుతున్న సీనియర్ ట్రైనర్ నీనాకరే

తిరుపతి లీగల్ : మధ్యవర్తిత్వంతో కోర్టులతో పాటు న్యాయవాదులకు, ప్రజలకు ఉపయోగాలు ఉంటాయని తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి ఎం.గురునాథ్ తెలిపారు. తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్ హాల్లో గురువారం తిరుపతి మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై న్యాయవాదులతో సమావేశం ఏర్పాటు చేశారు. సీనియర్ ట్రైనర్, మధ్యవర్తి, సామాజిక కార్యకర్త అయిన నీనాకరే మధ్యవర్తిత్వం ఎలా నిర్వహించాలి ? తదితర అంశాలను న్యాయవాదులకు వివరించారు. తిరుపతి అదనపు సీనియర్ సివిల్‌జడ్జి సునీతారాణి, తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గోపీచంద్, ప్రధాన కార్యదర్శి మార్టిన్ పాల్గొన్నారు.



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.70,400
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.6,360
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.84,100
రిటైల్ వెండి గ్రాము రూ.86.10

క్లుప్తంగా

అట్టహాసంగా జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు



టాస్ వేసి క్రికెట్ పోటీలను ఆరంభిస్తున్న నాయకులు

చిల్లకూరు: తీర ప్రాంతంలోని మోమిడి గ్రామ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు గురువారం అట్టహాసంగా ఆరంభమైనాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ తమ స్నేహితులు శశికుమార్, శేషేంద్ర జ్ఞాపకార్థం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తిరుపతి, నెల్లూరు జిల్లాలకు చెందిన సుమారు 70 జట్లు తమ పేర్లు నమోదు చేసుకున్నాయని, ఇందులో భాగంగా తొలి రోజు 20 ఓవర్ల మ్యాచ్‌లు నిర్వహించగా ఉదయం అంకులపాటూరు, బూదనం జట్లు తలపడ్డాయన్నారు. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అంకులపాటూరు జట్టు నిర్ణీత ఓవర్లలో 96 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బూదనం జట్టు నిర్ణీత ఓవర్లలో 97 పరుగుల చేసి విజేతగా నిలిచింది. మధ్యాహ్నం తొలుత బ్యాటింగ్ చేపట్టిన చెన్నూరు జట్టు నిర్ణీత ఓవర్లలో 80 పరుగులకు ఆలౌట్ కాగా.. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన వాకాడు జట్టు 81 పరుగులు చేసి విజేతగా నిలిచింది. ఈ క్రికెట్ పోటీలను గ్రామానికి చెందిన మేగనూరు వెంకటకృష్ణయ్య టాస్ వేసి ఆరంభించారు. గ్రామ పెద్దలు, నిర్వాహకులు మోహన్, వినోద్, నాగరాజు, నిరీక్షణ్, సురేష్, సునీల్, మణి పాల్గొన్నారు.

గోవుల షెడ్లలో పాగా!

- 2018లో గోకులాలు పేరుతో షెడ్లు నిర్మాణం
- అప్పట్లో అన్ని షెడ్లు టీడీపీ కార్యకర్తలకే
- మళ్లీ అదే తరహాలో షెడ్ల ఏర్పాటుకు శ్రీకారం
- జిల్లాకు 495 షెడ్ల మంజూరు
- లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారుల ఆదేశాలు



గతంలో టీడీపీ ప్రభుత్వం నిర్మించిన షెడ్లు

తిరుపతి అర్బన్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం గోకులం పథకం పేరుతో లక్షలు వెచ్చించి పశువులు, సన్నజీవాలు, కోళ్లకు షెడ్లు నిర్మించింది. అయితే వాటి నిర్మాణ పనులు నిబంధనలతో సంబంధం లేకుండా టీడీపీ కార్యకర్తలకే కట్టబెట్టారు. ఎవరైనా ప్రశ్నిస్తే అవునా.. మా కార్యకర్తలకే ఇచ్చామంటూ పలువురు బాహాటంగానే చెప్పకొచ్చారు. ఇప్పుడూ అదే తరహాలో అదే పథకాన్ని తమ కార్యకర్తలకు కట్టబెట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు అధికారులు లబ్ధిదాల ఎంపికకు ఆదేశాలు జారీ చేశారు.

గ్రామ తీర్మానానికి ప్రాధాన్యం

ఉపాధి నిధుల ద్వారా ఇస్తున్న ఈ షెడ్లకు గ్రామ తీర్మానం లెటర్ తప్పనిసరిగా ఉండాలి. గతంలో మాదిరిగానే ఈ సారి కూడా టీడీపీ కార్యకర్తలకే షెడ్లు అప్పగిస్తారంటూ జిల్లాలో జోరుగా చర్చసాగుతోంది. ఇప్పటికే షెడ్ల కోసం ఆయా గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు గ్రామతీర్మానం లెటర్ తీసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది.

33 మండలాల్లో 495 షెడ్లు

జిల్లాలో 34 మండలాలు ఉన్నాయి. తిరుపతి మినహా మిగిలిన 33 మండలాల్లో ఈ షెడ్లు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో మండలానికి 15 షెడ్లు మంజూరు చేస్తారు. అయితే తీర ప్రాంతాలకు సంబంధించి తడ, చిల్లకూరు, కోట, వాకాడు, సూళ్లూరుపేట మండాలాల్లో ఒక్కో మండలానికి 30 షెడ్లు చొప్పున మంజూరు చేయనున్నారు. అదే విధంగా తిరుపతి రూరల్ ప్రాంతంలో కోళ్లఫారాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో తిరుపతి రూరల్ మండలానికి 30 షెడ్లు కేటాయించారు.

ఆగస్టు 31కి ప్రక్రియపూర్తి

షెడ్లు ఏర్పాటు కోసం లబ్ధిదారులు యూనిట్ వివరాలను వెల్లడించడంతోపాటు ఆధార్‌కార్డు, తెల్లరేషన్ కార్డు ఉండేవారు ఆయా మండల పశువైద్యాధికారి వద్ద దరఖాస్తులను సమర్పించాలి. దరఖాస్తులు కావాల్సిన వారు మండల పశువైద్యాధికారులను కలిస్తే వారు అందజేస్తారు. సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు.

షెడ్లు నిర్మాణంకు.. సబ్సిడీ ఇలా

షెడ్లు	యూనిట్ కాస్ట్	రూ.సబ్సిడీ (90శాతం)	రైతు వాటా (10శాతం)
2 పశువులు	1,15,000	1,03,500	11,500
4 పశువులు	1,85,000	1,66,500	18,500
6 పశువులు	2,30,000	2,07,500	23,000

సన్నజీవాలు

షెడ్లు	యూనిట్ కాస్ట్	రూ.సబ్సిడీ (70శాతం)	రైతు వాటా (30శాతం)
20 గొర్రెలు లేదా మేకలు	1,30,000	91,000	39,000
50 గొర్రెలు లేదా మేకలు	2,30,000	1,61,000	69,000
100 కోళ్లకు షెడ్‌కు	87,000	60,900	26,100
200 కోళ్లకు షెడ్‌కు	1,32,000	92,400	39,600

70 నుంచి 90 శాతం రాయితీ

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లకు షెడ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆ మేరకు 70 నుంచి 90 శాతం సబ్సిడీతో పలు షెడ్లు నిర్మాణాలు చేపట్టనున్నారు. యూనిట్ల ఎంపిక ప్రక్రియను పశువైద్యాధికారులకు అప్పగించారు. ఆ మేరకు వారు కసరత్తు ప్రారంభించారు. అయితే షెడ్ల నిర్మాణాలను పర్యవేక్షించాల్సిన బాధ్యతలు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ విభాగానికి అప్పగించారు.

గత ప్రభుత్వంలో శాశ్వత భవనాలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శాశ్వత భవనాలను నిర్మించడానికి శ్రీకారం చుట్టింది. ప్రధానంగా రైతు భరోసా కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు, బల్క్ మిల్క్ కూలింగ్ కేంద్రాలు తదితర వాటికి ప్రాధాన్యత ఇచ్చింది. అయితే టీడీపీ కూటమి వాటిని పక్కనబెట్టి మళ్లీ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకం ద్వారా గోకులం షెడ్లకు శ్రీకారం చుట్టింది.



షెడ్లు యూనిట్ల ఎంపికపై దిశానిర్దేశం చేస్తున్న జిల్లా పశువైద్యాధికారి రవికుమార్ (ఫైల్)

గ్రామ తీర్మానం లెటర్ తప్పనిసరి



“సబ్సిడీ షెడ్ నిర్మాణానికి లబ్ధిదారులు ఆ గ్రామ పంచాయతీ తీర్మానం లెటర్ తప్పకుండా ఇవ్వాలి. మండల పశువైద్యాధికారిని సంప్రదిస్తే లబ్ధిదారులకు అవసరమైన దరఖాస్తులు అందిస్తారు. ఆగస్టు 31వ తేదీకి ఈ ప్రక్రియ పూర్తిచేస్తాం.

–రవికుమార్, జిల్లా పశువైద్యాధికారి

శిక్షణకు ఎంపిక



సంక్రాంతి రాజేంద్రుడు

శ్రీకాళహస్తి: ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో అధ్యాపకునిగా విధులు నిర్వహించే సంక్రాంతి రాజేంద్రుడికి అరుదైన గౌరవం లభించింది. రాష్ట్రంలోని అన్ని డిగ్రీ కళాశాలల్లో నేషనల్ ఎడ్యుకేషన్–2020 అనుసరించి అకడమిక్ ఇయర్ 2024–25 మూడో సెమిస్టర్‌కు సంబంధించి సింగ్ మేజర్ స్ట్రీమ్ ప్యాట్రన్‌లో భాగంగా రెండు కోర్సులను ప్రవేశపెట్టారు. ఇందుకు సంబంధించి ఏపీసీసీఈ వారు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగాధిపతి సంక్రాంతి రాజేంద్రుడు తిరుపతి జిల్లా తరఫున ఎంపికయ్యారు. ఈ అవకాశం రావడంతో ఆయన్ను కళాశాల ప్రిన్సిపల్ శ్రీలత, అధ్యాపకులు వర్మ, బాపనయ్య, పరంధామయ్య తదితరులు అభినందించారు

శ్మశాన స్థలం ఆక్రమణపై ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాలనీవాసులు

పుత్తూరు: పుత్తూరు మండలం తడుకు పంచాయతీలోని మజ్జిగ గుంట ఎస్టీ కాలనీ శ్మశాన స్థలాన్ని కబ్జాదారుల నుంచి పరిరక్షించాలని కోరుతూ గ్రామస్తులు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ, పలు పోరాటాల ఫలితంగా 2018లో తడుకు గ్రామ లెక్క దాఖల సర్వే నంబర్ 169/2–ఎలో 50 సెంట్ల భూమిని మజ్జిగగుంట శ్మశానానికి ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈనెల 24న కొందరు గుర్తు తెలియని వ్యక్తులు శ్మశాన స్థలాన్ని జేసీబీతో చదును చేశారని తెలిపారు. కబ్జాదారులను గుర్తించి కఠినంగా శిక్షించి, ఆక్రమణల నుంచి శ్మశాన స్థలానికి విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దారుకు అందజేశారు.

సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు త్వరలో నోటిఫికేషన్

- ప్రత్యేక ప్రవేశ పరీక్ష ద్వారా ఇంజనీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్లు
- ఈ ఏడాది నుంచే అడ్మిషన్లు చేపడతాం
- ఏపీఈఏఎంసెట్‌లో అర్హత సాధించిన వారు దరఖాస్తు చేసుకునే అవకాశం
- ఎస్వీయూ దూరవిద్యకు మహర్దశ
- డీడీఈ పునరుద్ధరణకు యూజీసీతో మంతనాలు
- త్వరలో ఢిల్లీకి వర్సిటీ అధికారులు
- ఎస్వీయూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ భూపతినాయుడు



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ భూపతినాయుడు

తిరుపతి సిటీ: ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఈ ఏడాది ఏపీఈఏఎంసెట్–2024 కౌన్సెలింగ్ వెబ్ ఆప్షన్ల నుంచి సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను తొలగించారు. దీంతో 'సెల్ఫ్‌కు చరమగీతం' పేరుతో 'సాక్షి'లో కథనం వెలువడింది. దీంతో వర్సిటీ అధికారులు అప్రమత్తమై సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను కొనసాగించడంలో ఎదురయ్యే సమస్యలపై చర్చించారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను తొలగించడం, డీడీఈ పునరుద్ధరణకు చేపట్టే చర్యలపై గురువారం వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ భూపతి నాయుడు 'సాక్షి'తో పలు అంశాలపై చర్చించారు. ఆయన మాటల్లోనే...

ఈ ఏడాది నుంచే అడ్మిషన్లు

ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌కు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రస్తుత 2024 అకడమిక్ ఇయర్‌లో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను పలు కారణాల చేత నిలిపివేశారు. కానీ సుదీర్ఘంగా అధికారులు, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులతో ప్రత్యేకంగా సమావేశమై కోర్సులను కొనసాగించడంలో ఎదురయ్యే సమస్యలపై చర్చించాం. ప్రధానంగా మహిళలకు హాస్టల్ వసతి, బోధన సిబ్బంది, క్లాస్‌రూమ్‌ల కొరతతోనే కోర్సులను నిలిపి వేసినట్లు గుర్తించాం. తిరిగి ఎలాగైన సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను ఈ ఏడాది నుంచే కొనసాగించాలని నిర్ణయించాం. డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ ఏడాది నుంచే ఈసీఈ, సీఎస్ఈ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వంటి పలు కోర్సులకు నోటిఫికేషన్ ఇస్తాం. ప్రత్యేక ప్రవేశ పరీక్షను నిర్వహించి మెరిట్ ప్రాతిపదికన అడ్మిషన్లు తీసుకుంటాం. అదేవిధంగా ఏపీఈఏఎంసెట్–24 లో మంచి ర్యాంకుతో అర్హత సాధించిన వారు ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కల్పిస్తాం. త్వరలో విధివిధానాలు విడుదల చేస్తాం.

త్వరలో దూరవిద్యకు మహర్దశ

ఎస్వీయూ దూరవిద్యకు రాష్ట్ర వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. సుమారు వర్సిటీకి రూ. 60కోట్లు ఆదాయం వచ్చే ఏకైక దూరవిద్యాకేంద్రం వర్సిటీలో ఉండడం అవసరం. లక్షల మంది విద్యార్థులు పలు కోర్సులను అభ్యసించి ఉన్నత స్థాయిలో ఉన్నారు. ఐఏఎస్‌లు, కేంద్ర సర్వీసులోని ఉన్నతాధికారులు దూరవిద్యాకేంద్రంలో పీజీలు చేశారు. అనివార్య కారణాలతో అడ్మిషన్ల ప్రక్రియకు బ్రేక్ పడింది. డీడీఈకి త్వరలో మహర్దశ కల్పిస్తాం. దూరవిద్యాకేంద్రంలో ప్రస్తుతం ఉన్న కోర్సులను కొనసాగిస్తూ మరిన్ని కొత్తకోర్సులను ప్రవేశపెట్టాలనే ఆలోచన ఉంది. త్వరలో వర్సిటీ అధికారులు ఢిల్లీకి బయలుదేరి డీడీఈ పునరుద్ధరణకు యూజీసీతో చర్చించనున్నాం. డీడీఈలో త్వరలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది.

ఫైనల్‌కు దూసుకెళ్లిన వైజాగ్ జట్టు



విజయం సాధించిన విశాఖపట్నం జట్టు

వెంకటగిరి రూరల్: ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని తారక రామ క్రీడా ప్రాంగణంలో అండర్–16 విభాగం సెమిఫైనల్ క్రికెట్ పోటీలు పోటాపోటీగా సాగాయి. విజయనగరం– విశాఖపట్నం జట్ల మధ్య ఇన్నింగ్స్–2, 3లో హోరాహోరీగా తలపడ్డాయి. సెమీఫైనల్‌కు విశాఖపట్నం జట్టు అర్హత సాధించింది. ఓవర్‌నైట్ పోటీల్లో విజయనగరం జట్టు 71.1 ఓవర్లకు 145 పరుగులు చేసి ఆలౌట్ అయింది. విజయనగరం జట్టుపై విశాఖపట్నం జట్టు 247 పరుగుల తేడాలో ఫైనల్ పోటీలకు ఎంపికైంది. నెల్లూరులో జరగనున్న ఫైనల్ మ్యాచ్‌లో విశాఖపట్నం– కృష్ణ జిల్లాల మధ్య పోటీ జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలకు సీడీ శ్రీనివాసులరెడ్డి స్కోరర్‌గా, అంపైర్లు హేమచంద్ర, కిరణ్ వ్యవహరించారు.

వీఆర్‌కు భాకరాపేట ఎస్‌ఐ

భాకరాపేట : సివిల్ కేసులో జోక్యం చేసుకున్నందుకు క్రమశిక్షణా రాహిత్యం కింద భాకరాపేట ఎస్‌ఐ విజయ్‌కుమార్‌నాయక్‌ను వీఆర్‌కు బదిలీ చేస్తూ తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఉన్నతాధికారుల సూచనలు పాటించకుండా, సివిల్ కేసులో జోక్యం చేసుకున్నట్లు విచారణలో నిర్ధారణ కావడంతో క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చట్టం ప్రకారం మన పరిధి దాటకూడదని ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే క్రమశిక్షణా చర్యలకు బాధ్యలవుతారని తెలిపారు. ఈ విషయంగా భాకరాపేట సీఐ మస్తాన్‌వల్లీని వివరణ కోరగా ఎస్పీ ఆదేశాలని తెలిపారు.

ప్రతి ఒక్కరూ మంచి వైద్యుడు కావాలి

- మెరుగైన వైద్యం అందించినప్పుడే అది సాధ్యం
- ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్
- ఘనంగా 64వ ఫౌండేషన్ డే వేడుకలు



ఎస్వీ మెడికల్ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న వైద్యులు

తిరుపతి తుడా: వైద్య విద్యను అభ్యసించే ప్రతి ఒక్కరూ గుడ్ డాక్టర్ అయ్యేందుకు కచ్చితమైన ప్రయత్నం చేయాలని ఎస్వీ మెడికల్ ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ పిలుపునిచ్చారు. రోగులకు సేవా దృక్పథంతో మెరుగైన వైద్యం అందించినప్పుడే అది సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఎస్వీ మెడికల్ కళాశాల 64వ ఫౌండేషన్ డే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సంద్భంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్వీ మెడికల్ కళాశాలకు ఘన చరిత ఉందని కొనియాడారు. ఇక్కడ చదువుకోవడం అందరూ అదృష్టంగా భావిస్తారన్నారు. నేటితరం వైద్య విద్యార్థులు మరింత క్రమశిక్షణతో విద్యను అభ్యసించాల్సిన అవసరం ఉందన్నారు. 1964 బ్యాచ్‌కి సంబంధించిన సీనియర్ వైద్యులు డాక్టర్ ప్రేమానంద, డాక్టర్ ధూమపానం పాల్గొని ప్రసంగించారు. శ్వాసకోస వ్యాధుల్లో వస్తున్న ఇబ్బందులు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తో వైద్యులకు, వైద్యవిద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ డే ప్రోగ్రాం ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శశికాంత్ మాట్లాడుతూ పెద్ద ఎత్తున ఫౌండేషన్ డేను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రుయా ఆస్పత్రి ఇంచార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాధా, ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకట్, డాక్టర్ డీఎస్ మూర్తి, ప్రసూతి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథిరెడ్డి, డాక్టర్ శీనయ్య, డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ చలపతి రెడ్డి, డాక్టర్ హరిబాబు, డాక్టర్ శ్రీనివాస్‌యాదవ్, డాక్టర్ పాహీం, ఏపీ ఎన్జీఓ పట్టణ అధ్యక్షులు సురేష్ బాబు, జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్, వైద్యులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధానికి కఠిన చర్యలు



దుంగలు పరిశీలిస్తున్న ఎస్పీలు

తిరుపతి మంగళం: శేషాచలం అడవుల్లోకి ప్రవేశిస్తున్న ఎర్రచందనం స్మగ్లర్లను నిరోధించడానికి కఠిన చర్యలు తీసుకుంటామని టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు తెలిపారు. కపిలతీర్థం సమీపంలోని టాస్క్‌ఫోర్సు కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఎర్రచందనం సంరక్షణ, సిబ్బంది పనితీరుపై టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్‌తోపాటు అధికారులతో సమావేశం నిర్వహించారు. సమాచారం పొందే విధానం నుంచి స్మగ్లర్లను పట్టుకోవడానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. సబ్ కంట్రోల్ నుంచి జరుగుతున్న ఆపరేషన్ విధానాలను టాస్క్‌ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ వివరించారు. అనంతరం టాస్క్‌ఫోర్సు ఆవరణలోని కంట్రోల్ రూమ్, పోలీసు స్టేషన్, అక్కౌంట్స్ ఆఫీసు, రవాణా ఆఫీసు తదితర ప్రాంతాలను సందర్శించారు. డీఎస్పీ చెంచుబాబు, ఆర్ఐ (ఆపరేషన్స్) సురేష్ కుమార్‌రెడ్డి, ఎస్పీఎఫ్ శ్రీనివాస్, సీఐలు శ్రీనివాసులు, సురేష్ కుమార్, ఎస్ఐ రఫీ, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.